క్లుప్తంగా

కరెంటు ఉండని ప్రాంతాలు

కాప్రా: మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నరేందర్ తెలిపారు. 11కేవీ హైటెన్షన్ ఫీడర్, శ్రీచక్ర ఫీడర్, వాయుపురి ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేతాజీనగర్, అశోక్ ఎన్‌క్లేవ్, మంజు ఎన్‌క్లేవ్, ఓయూటీ కాలనీ, భాస్కర్‌రావునగర్, వాయుపురి, డిఫెన్స్ కాలనీలో కరెంటు ఉండదని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీపురి ఫీడర్, ఎల్లారెడ్డిగూడ ఫీడర్ల పరిధిలోని లక్ష్మీపురం, అయోధ్యనగర్, రుక్మిణీపురం, వినాయక్‌నగర్, హనుమాన్‌నగర్, కాప్రాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి పరీక్షలు చేయించుకున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం పరిశీలించిన ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల కోసం వచ్చే వారికి మెరుగైన వసతులను కల్పించినట్లు తెలిపారు. కంటి పరీక్షలతో అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేసే ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక నేతలు చంద్రమోహన్, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నాలుగో రోజు రిలే నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న కాలనీ మహిళలు

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ నాలుగో రోజు బోడుప్పల్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆర్ఎన్ఎస్ కాలనీలో చేపట్టిన ఈ దీక్షలో శారద, సునీత, ఉమా, రాజేశ్వరి, మురళి కృష్ణతోపాటు జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కో చైర్మన్లు కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, కొత్త కిశోర్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు ప్రహ్లాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్తుపేపర్లు తరలిస్తున్న డీసీఎం వ్యాన్ దగ్ధం

ఉప్పల్: చిత్తు పేపర్లను తరలించే డీసీఎం వ్యాన్ దగ్ధమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. సికింద్రాబాద్ నుంచి చిత్తు పేపర్ల లోడ్‌తో నారపల్లి వైపు వస్తున్న డీసీఎం వ్యాన్‌లో ఉప్పల్ బస్టాప్ వద్ద మంటలు చెలరేగాయి. డ్రైవర్‌తో పాటు వాహనదారులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముంబై నుంచి తెచ్చి..

- కాలంచెల్లిన వస్తువులకు రీస్టిక్కరింగ్ వేసి..
- చాక్లెట్లు, బిస్కెట్ల దగ్గర్నుంచి సబ్బుల వరకు..
- నగరంలోని వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయిస్తున్న ముఠా
- ముగ్గురు అరెస్టు, పరారీలో నిర్వాహకులు
- వివరాలను వెల్లడించిన మల్కాజిగిరి డీసీపీ ధరావత్ జానకి



వివరాలను వెల్లడిస్తున్న మల్కాజిగిరి జోన్ డీసీపీ ధరావత్ జానకి

మేడిపల్లి: కాలం చెల్లిన వస్తువులపై రీప్రింటింగ్ చేసి కొత్త తేదీలతో స్టిక్కరింగ్ చేసి వినియోగదారులకు విక్రయిస్తున్న స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే.. మేడిపల్లి పోలీస్ స్టేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగి జోన్ డీసీపీ ధరావత్ జానకి, ఎస్‌వోటీ మల్కాజిగిరి జోన్ డీసీపీ గిరిధర్, ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ గోవర్ధనగిరితో కలిసి వివరాలను వెల్లడించారు. నగరంలోని అబిడ్స్, ట్రూప్‌బజార్‌లో నివాసం ఉంటున్న అంబాల జైన్, కమల్ జైన్, సంగీత జైన్ ఆర్నెళ్ల క్రితం బోడుప్పల్ రెడ్డీస్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులో ఫ్లాట్ అద్దెకు తీసుకుని హరియంట్ కార్పొరేషన్ పేరుతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ముంబై, ఇతర రాష్ట్రాల నుంచి కాలం చెల్లిన వస్తువులను తీసుకువచ్చి వాటిపై స్టిక్కరింగ్ వేసి వివిధ ప్రాంతాల్లో మళ్లీ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సికింద్రాబాద్, నల్లకుంటకు చెందిన బార నరేష్(64) అకౌంటెంట్, జగద్గిరిగుట్టకు చెందిన అబ్దుల్ రహీమ్(47) స్టోర్ కీపర్, ఉమాకాంత్ (30) స్టోర్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.10 లక్షల విలువైన కాలంచెల్లిన చాక్లెట్లు, బిస్కెట్లు, చూయింగ్ గమ్‌లు మొదలుకొని సోప్స్, చిప్స్ వరకు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మూడు ఫోన్లు, రెండు కంప్యూటర్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



కౌకూర్ రాజీవ్ గృహకల్పలో నందికంటి శ్రీధర్ తదితరులు

అల్వాల్: చేయిచేయి కలిపి బంగారు తెలంగాణ నిర్మించే దిశగా అడుగులు వేయాలని మేడ్చల్–మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కౌకూర్ రాజీవ్‌గృహకల్ప నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప, వాంబే పరిసర ప్రాంతాల్లో పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప, గృహ సముదాయం కాంగ్రెస్ హయాంలోనే చేపట్టామన్నారు. ప్రస్తుతం సమస్యలు పంజా విసురుతున్నాయని అన్నారు. నీటి సరఫరా లేక చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చాక అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. నాయకులు డోలి రమేష్, చంద్రశేఖర్, సీఎల్. యాదగిరి, పవన్‌కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, వీనస్‌మేరి, నిర్మల, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

బోడుప్పల్: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా బోడుప్పల్‌లోని 7, 8, 9 డివిజన్లలో బుధవారం పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటిపై పోరాటం సాగించి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, పక్కీర్ హరినాథ్‌రెడ్డి, గాదె రమణారెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

హరితహారంలో నాటిన మొక్కలను పరిరక్షించండి



అధికారులతో చర్చిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: దేశవ్యాప్తంగా మేయర్లు, అధికారులతో 'పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ'పై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మేయర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వారితో చర్చించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వాటిని పరిరక్షించాలని, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని, రోడ్లు, కాలనీలు పరిశుభ్రంగా ఉండేందుకు ఊడ్చిన చెత్త చెదారాన్ని స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లతో చెత్త డంపింగ్ కేంద్రాలకు తరలించాలని కోరారు. ప్రధాన రహదారిలో ఉన్న మొక్కలకు ప్రతిరోజూ నీరు పోయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

అల్వాల్: దేవుడి అల్వాల్‌లోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ సదానంద్, ప్రిన్సిపాల్ కే.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ షివిలీరామ్, దేవుడి అల్వాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ సామ్యూల్‌ల ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అన్ని రంగాల్లో రాణించాలి



ఫేర్‌వెల్ కార్యక్రమంలో బధిర విద్యార్థులు

అల్వాల్: బధిర విద్యార్థులు ఇతర విద్యార్థులకు దీటుగా అన్నిరంగాల్లో రాణించాలని హెలన్ కెల్లర్స్ విద్యా సంస్థల చైర్మన్ పఠాన్ ఉమర్‌ఖాన్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని హెలన్ కెల్లర్ బధిర విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'ఆయుష్మాన్' సేవలు అభినందనీయం

మల్లాపూర్: మల్లాపూర్ నెహ్రూనగర్‌లో నివసిస్తున్న వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆయుష్మాన్ గ్రూప్ ఆఫ్ చారిటీస్ ఆధ్వర్యంలో ఇస్తున్న పెన్షన్లను బుధవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి పెన్షన్లు అందజేస్తున్న ఆయుష్మాన్ గ్రూప్ ఆఫ్ చారిటీస్ సేవలు అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్పీ అనురాధ, కాలనీ అధ్యక్షుడు నాగారం బాబు, కార్యదర్శి చిన్న దుర్గయ్య, నర్సింగ్‌రావు, దేవయ్య, రమణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పెన్షన్లు అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

రేపు ఆలయ భూమిలో గడ్డికి వేలం

రామంతాపూర్: ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధీనంలోని మల్లికార్జున స్వామి దేవస్థానానికి చెందిన ఎకరం 12 గుంటల భూమిలో మార్చి 30 నుంచి రెండు సంవత్సరాల పాటు పచ్చి గడ్డి కోసుకునేందుకు ఈనెల 3న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెల్లంకి నరేందర్ బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దేవాలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి చోరీ

ఉప్పల్: శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి చోరీ జరిగిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రామంతాపూర్ బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన లీలావతి(70) మంగళవారం ఇంటికి తాళం వేసి బంధువుల శుభకార్యానికి వెళ్లింది. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా పూజగదిలోని వెండి సామాన్లు చోరీ అయినట్లు గుర్తించింది. దీంతో బాధితురాలు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించింది. దాదాపు కిలో వరకు వెండి సామాగ్రి పోయిందని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



అనుష(ఫైల్)

ఉప్పల్: యువతి అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన జి.సునీత కుమార్తె అనుష(19) నీట్ పరీక్షలకు ఫీజు చెల్లించింది. కొద్ది రోజులుగా సరిగ్గా ప్రిపేర్ అవడం లేదని గమనించిన తల్లి మంగళవారం రాత్రి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఉదయం వేళ తల్లి లేచి చూసే సరికి ఇంట్లో లేదు. దీంతో పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లో రోడ్డు పనులు ప్రారంభించండి



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ ఇందిరానగర్‌లో బుధవారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పర్యటించారు. ఇటీవల ఇందిరానగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కొందరు వ్యక్తులు పాత రోడ్డు తీసివేయాలని డిమాండ్ చేస్తున్నారని, విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ కాలనీలో పర్యటించి కాలనీవాసులతో చర్చించారు. పాత రోడ్డుపైనే రోడ్డు వేసే విధంగా కాలనీవాసులు అంగీకరించి సంతకాలు చేయడంతో పనులు ప్రారంభించాలని అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సంజన్న, శ్రీధర్, బుచ్చన్నగౌడ్, రఫిక్, వాసు, జహీర్, బబ్లు, అఫ్సర్ పాల్గొన్నారు.

బీరప్పగడ్డ సమగ్ర అభివృద్ధికి కృషి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బీరప్పగడ్డలో శిథిలావస్థకు చేరుకున్న సీవరేజ్ పైప్‌లైన్ తొలగించి కొత్త లైన్ వేయిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. బీరప్పగడ్డ రామాలయం ప్రాంతంలో గ్రామ పంచాయతీ కాలం నాటి సీవరేజ్ లైన్ పాడైపోవడంతో స్థానికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని స్థానికుల అభ్యర్థన మేరకు నూతన పైప్‌లైన్ వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కోకొండ జగన్, బాలుశ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.



బీరప్పగడ్డలో సీవరేజ్ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



కాప్రా గాంధీనగర్‌లో కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: పేదల కోసం అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో బుధవారం అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అద్భుతమన్నారు. మహిళలకు బ్రెస్ట్ కేన్సర్, గైనిక్, డెంటూ ఓరల్, డిజిటల్ మెమోగ్రఫీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పరీక్షల్లో అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనుముల నర్సింహారెడ్డి, ఇంద్రయ్య, భైరి నవీన్‌గౌడ్, సత్యనారాయణ, కుమారస్వామి, నర్సింహారెడ్డి, నర్సింగారావు, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శివప్రసాద్, క్యాంప్ కో ఆర్డినేటర్ ప్రసాద్, అభయ ఫౌండేషన్ ప్రతినిధులు శేషు తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు

కుషాయిగూడ: జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీలత దంపతులను ఘనంగా సత్కరించారు.



ముడుపులు ఇస్తేనే ఇంటికి స్లాబ్

- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు ముట్టజెప్పాల్సిందే..
- లేదంటే వివిధ కారణాలతో కూల్చివేతలే..
- పేద, మధ్యతరగతి వారికి ఇల్లు కలేనా..?
- మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

రామంతాపూర్: పేద, మధ్యతరగతి వారు ఇళ్లు నిర్మించుకోవాలంటే బీఆర్ఎస్ కార్పొరేటర్‌కు ముడుపులు ఇవ్వాల్సిందే.. లేదంటే కూల్చేస్తారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. నెహ్రూనగర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రజా గోష – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో సామాన్యుడు, మధ్య తరగతి ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాలంటే బీఆర్ఎస్ కార్పొరేటర్లకు ముడుపులు చెల్లించుకున్నాకే గోడలు లేపి స్లాబ్ పడుతుందని, లేదంటే పడగొడతారన్నారు. రానున్న ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, అందుకు కార్యకర్తలు, నేతలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారు శ్రీవాణివెంకట్రావు, కక్కిరేని చేతన హరీష్, జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, వెంకట్రావు, జగదీష్‌కుమార్, బాలకృష్ణ, మంగ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు అంతం పలికేందుకు..

గౌతంనగర్: రాష్ట్రంలో అవినీతి పాలనను సాగనంపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని బీజేపీ నేత మనోజ్ అన్నారు. జ్యోతినగర్‌లో బుధవారం బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మాశెట్టి అనిల్‌గుప్తా ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలన అవినీతిమయంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, ధన్‌రాజ్, ఈసం రాకేష్, గణేష్, బాలరాం, బాలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల విజయోత్సవ ర్యాలీ

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలో బీజేపీ కార్నర్ సమావేశాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం నాచారంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పోతగాని గోపాల్‌గౌడ్, రాగిరి మోహన్‌రెడ్డి, అనితారెడ్డి, చంద్రమౌళి, రాజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అమర్, అభిషేక్‌గౌడ్, గోపి, ఉదయ్‌కిరణ్, యోగేశ్వర్‌రెడ్డి, సాయిగౌడ్, నర్సింహారెడ్డి, రవికాంత్, వెంకటేష్, ఆనంద్, మహేష్‌గౌడ్, బాలు, వెంకటేశ్వర్లు, లింబాద్రి మంజులవాణి, వరలక్ష్మీ, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ వినోభానగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి సర్వేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజాగోస – బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జిల్లెల రవియాదవ్ హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలలింగం, మాజీ కౌన్సిలర్ నర్సింహగౌడ్, ఆనంద్ గౌలికర్, పోలీంగ్ బూత్ అధ్యక్షులు సోమ్‌నాథ్‌చారి, ఐలేష్, అశోక్, నాయకులు ఉమామహేశ్వరి, గోపాలకృష్ణయాదవ్, మణిరత్నం, భజరంగ్, రాములుయాదవ్, మల్లేష్ యాదవ్, రాము, భాస్కర్, సుమలత, రమేష్, నరేందర్, సూర్యకాంత్, సాయిరామ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



జ్యోతినగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేత మనోజ్

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ నిరసన

అల్వాల్: ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యావిధాన చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉన్ని క్రిష్టన్ డిమాండ్ చేశారు. అల్వాల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బుధవారం వారు నిరసన వ్యక్తం చేశారు. టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. 2017 నుంచి టీఏ, డీఏ బకాయిలు మొత్తం చెల్లించాలన్నారు. దీనికి సరిపడా బడ్జెట్‌ను వెంటనే రిలీజ్ చేయాలన్నారు.

నాణ్యత పాటించకుంటే చర్యలు



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గంప కృష్ణ, ఈశ్వరయ్య, సంతోష్, రామకృష్ణ, శేఖర్‌నాయక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.